

మీకు న్యాయం జరగకుంటే.. నాకు ఫోన్ చేయండి

- నిరంతరం ప్రజలకు అందుబాటులో సెల్ నెం.91211 00500
- అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి
- గంజాయి, ట్రిపుల్ రైడింగ్ కోసం ప్రత్యేక దళం
- స్టేషన్లలో సివిల్ పంచాయితీలు చేస్తే కఠిన చర్యలు
- ప్రజలతో మమేకమయ్యేందుకు పల్లె నిద్ర
- ఆంధ్రజ్యోతితో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కడప, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇది నా సెల్ నెంబర్ 9121100500. జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా బాధితులకు న్యాయం జరగక పోయినా, పొలిటికల్ నేతల ప్రమేయం లేకుండా ఫిర్యాదులు నమోదు చేయకున్నా ఈ నెంబరుకు ఫోన్ చేయవచ్చు. లేదంటే ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలిసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో శాంతిభద్రతలు కాపాడడంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలో పలు విషయాలపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో కొన్ని పోలీస్‌స్టేషన్లలో రాజకీయ నాయకుల సిఫారసు లేకుంటే ఫిర్యాదులు తీసుకోవడం లేదు. దీంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు?

ఎస్పీ: బాధితులు న్యాయం కోసం అర్ధరాత్రి అయినా పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఫిర్యాదు తీసుకోవాల్సిందే.. విచారణ చేయాల్సిందే. రాజకీయ నాయకులు సిఫారసు ఉంటేనే కేసు కడతామని ఎవరైనా చెబితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేసు తీసుకోకుంటే బాధితులు నేరుగా 9121100500కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలా చేయలేకపోతే ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయవచ్చు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పీస్‌ఫుల్ కడపగా మారుస్తాను.

ఆంధ్రజ్యోతి: ఇటీవల కాలంలో ప్రజలకు, పోలీసుల మధ్య సత్సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. మరి జనంతో మమేకం అయ్యేందుకు ఎలాంటి కార్యక్రమం చేపడుతున్నారు?

ఎస్పీ: ప్రజలతో మమేకమయ్యేందుకు నెలరోజులుగా పల్లెనిద్ర కార్యక్రమం చేపడుతున్నాం. అలాగే కళాజాత కార్యక్రమం ద్వారా సైబర్‌క్రైం, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇన్‌స్పెక్టర్ నుంచి సిబ్బంది వరకు పల్లెలో ఆ రాత్రి బసచేయాల్సిందే. తొలుత ఫ్యాక్షన్ గ్రామాల్లో సుమారు 40 గ్రామాల్లో బస చేశారు. అక్కడ జనంతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటారు. పోలీసులకు సంబంధించిన విషయాలతే వెంటనే మేము టేకప్ చేస్తాం. రెవెన్యూ సంబంధిత విషయాలు అయితే రెఫర్ చేస్తాం. పల్లెనిద్రలో గ్రామసభ నిర్వహించి సైబర్‌క్రైంపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో గంజాయి ఎక్కువగా వినియోగం ఉంది. అలాగే మత్తుకోసం యువత అడ్డదారి పడుతోంది. ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్పీ: గంజాయి ఇతర మాదకద్రవ్యాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దీనిపై ఈగల్ అనే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసింది. మన జిల్లాలో కూడా ఒక ప్రత్యేక టీం ఏర్పాటైంది. గంజాయిని అరికట్టేందుకు ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది.. ఎవరు తెస్తున్నారు.. ఎవరు అమ్ముతున్నారు.. ఇలా ప్రతి దానిపై క్షుణ్ణంగా నిఘా ఉంచాం. గంజాయి విక్రయించే వారిపై ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. వారి ఆస్తులను, బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తున్నాం. కడపలో గంజాయి బ్యాచ్‌ను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాల నిఘా ఉంచాం. ఇది బుగ్గవంక పరిసర ప్రాంతాలు, రింగురోడ్డు, చెన్నూరు ఇలా శివారు ప్రాంతాల్లో నిఘా ఉంచాం. ఇప్పటికే కొన్ని గంజాయి స్పాట్‌లను గుర్తించాం. అలాగే గ్యాంబ్లింగ్, పేకాట, బెట్టింగ్‌లపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: చాంపియన్స్ ట్రోఫీ జరుగుతోంది. త్వరలో ఐపీఎల్ మొదలుకానుంది. మరి బెట్టింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

ఎస్పీ: క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా ఉంచాం. బుకీలు, ఎవరెవరు బెట్టింగ్ ఆడుతున్నారో నిఘా ఉంచాం. ఆన్‌లైన్‌పై దృష్టి పెట్టాం. ఇప్పటికే కొందరిని అరెస్టు కూడా చేశాం. సమాజానికి హానికరమైన క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూదంపై ఉపేక్షించేది లేదు. ప్రత్యేక టీం తన పని తాను చేసుకుపోతుంది.

ఆంధ్రజ్యోతి: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లకు సంబంధించి కేసు నెమ్మదించింది. కారణం ఏమిటి?

ఎస్పీ: సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా ఎవరినైనా కించపరిచినా, మతాల మధ్య చిచ్చుపెట్టే పోస్టులు పెడితే సుమోటోగా కేసు నమోదు చేస్తాం. ఐటీ వింగ్ సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాం. పొరపాటున అభ్యంతరకర, మనోభావాలు దెబ్బతినేలా, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దు. పోలీసుల నిఘా ఎక్కువగా ఉంది. కఠినచర్యలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: వర్రా రవీంద్రారెడ్డి కేసు ఏమైంది ?

ఎస్పీ: వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రారెడ్డిపై జిల్లాలో నమోదైన కేసులపై విచారణ సాగుతోంది. దాని కోసం ప్రత్యేక టీం పనిచేస్తోంది. ఆధారాలు సేకరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఇసుక, మట్టి విచ్చలవిడిగా సాగుతోంది. దీనిపై నిఘా పెట్టారా ?

ఎస్పీ: ప్రజలందరికీ ఉచిత ఇసుక ఇవ్వాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష. ఉచిత ఇసుకను అక్రమ వ్యాపారానికి ఉపయోగించుకుంటే కేసు నమోదు చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన యంత్రాలతోనే రీచ్‌ల్లో తవ్వకాలు జరపాలి. ఇక రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా గ్రావెల్, మట్టి రవాణా చేస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ప్రమాదాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్పీ: జిల్లాలో ప్రమాదాల నివారణకు ఓ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. 42 బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. అక్కడే యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. అక్కడ ప్రమాద నివారణ చర్యల కోసం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో 4న ఎన్‌హెచ్ వారితో సమావేశం ఏర్పాటు చేశాం. ఆ బ్లాక్‌స్పాట్‌లలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు చేపట్టనున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో భూకబ్జాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్పీ: భూకబ్జాలపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ప్రభుత్వ, సామాన్యుల భూములు ఆక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో సీసీ కెమెరాల వ్యవస్థ దెబ్బతింది కదా ?

ఎస్పీ: 500 మంది వచ్చే ప్రతి వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిబంధన ఉంది. అలాంటి వాటిని గుర్తించాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు ఇస్తున్నాం. సీసీ కెమెరాలు చాలా సేఫ్. ప్రతి ఒక్కరూ వాటిని అమర్చుకోవాలి. కడపలో రహదారుల విస్తరణలో భాగంగా సీసీ కెమెరాల వ్యవస్థ దెబ్బతింది. వాటి పునరుద్ధరణ, మరో 6 చోట్ల నూతన సిగ్నల్స్ కోసం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో చర్చించాం. ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారు. రాగానే పనులు మొదలు పెడతాం.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
కడప	6.29	5.14
ప్రొద్దుటూరు	6.29	5.14
రాజంపేట	6.26	5.17
పీలేరు	6.27	5.09

జేసీ ఆదేశాలూ పట్టవా..?

- రెండురోజుల క్రితమే హెచ్చరికలు
- అయినా పట్టించుకోలేదు



పులివెందులలో రేషన్ పంపిణీ చేస్తున్న ఓ ఇంటి వద్ద సంచులను క్యూలైనులో పెట్టిన దృశ్యం

పులివెందుల రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశాలు పులివెందులలో పక్కన పెట్టేశారు. జేసీ రెండు రోజుల క్రితం పులివెందుల రేషన్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పులివెందులలో ఎండీయూ వాహనాలు తిరగడం లేదని పలువురు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్, డీటీలను ప్రశ్నించి పరిస్థితిపై ఆరాతీశారు. ఇకపై ఎండీయూ వాహనాల ద్వారానే పంపిణీ జరగాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ నిబంధనలు తమకు వర్తించవు అనుకున్నారో ఏమో మార్చి 1వ తేది నుంచి రేషన్ పంపిణీ జరుగుతుండగా పులివెందులలో కొందరు డీలర్లు యథావిధిగా ఇంటివద్దనే పంపిణీ చేస్తున్నారు. ఈ విషయం తహసీల్దార్, సివిల్ సప్లైస్ అధికారికి తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలను పులివెందుల అధికారులు లెక్కలేకి తీసుకోరేమోనని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

పుట్టింటికి చేరిన గంగమ్మ

- ముగిసిన జాతర
- కిక్కిరిసిన భక్తులు


7

బాల్య వివాహాల కట్టడికి చర్యలు

- ఐదేళ్లలో 339 నిలుపుదల...
- అయినా జరుగుతూనే ఉన్నాయి
- క్షేత్రస్థాయిలో పట్టించుకునేది ఎవరు ?



కడప ఎన్జీఓఆర్‌సర్కిల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మోయాల్సిన వయసులో పుస్తెల భారాన్ని భరిస్తున్నారు. బాల్య వివాహ చట్టం అమలులో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇది పూర్తిగా అమలు కావడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రతి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, గ్రామ సచివాలయ వ్యవస్థ అందుబాటులో ఉన్నా వీటిపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. రాజారామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం లాంటి సంఘ సంస్కర్తలు అప్పట్లో బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చారు. దీంతో బాల్య వివాహాల నిషేధ చట్టం వచ్చింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా బాల్యవివాహ చట్టం గురించి ప్రత్యేక కథనం.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

2006లో బాల్య వివాహ నిషేధ చట్టం అమలులోకి వచ్చింది. 18 నెలలలోపు బాలికలు 21 ఏళ్లలోపు బాలురు మైనర్ల కిందికి వస్తారు. వారి వివాహం చేసిన వారెవరైనా నేరస్థులుగా పరిగణించబడతారు. ఇందులో తల్లిదండ్రులు సంరక్షకులు, పురోహితులు స్నేహితులు, వివాహానికి వచ్చిన వారు, ఏర్పాట్లకు సహకరించిన వారు కూడా నేరస్థులుగా ఉంటారు. నేరస్థులకు రెండేళ్ల పాటు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు గత ఐదేళ్ల కాలంలో 339 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. 2020లో 40 మంది, 2021లో 16 మంది, 2022లో 4మంది బాలికలు, ఒక బాలుడికి సంబంధించిన వివాహాలు, 2023లో 147 మంది బాలికలతో పాటు ఇద్దరు బాలురకు సంబంధించిన వివాహాలు, 2024లో 75 మంది బాలికలు, ఒక బాలునికి సంబంధించిన వివాహాలు 2025లో మూడు బాల్య వివాహాలను అడ్డుకున్నారు. ఇవి కేవలం అధికారుల దృష్టికి వచ్చినవి మాత్రమే. వెలుగుచూడని బాల్య వివాహాలు వేల సంఖ్యలో ఉండవచ్చని అంచనా.

బాల్య వివాహాలు అరికడతాం...

బాల్య వివాహాలను నిర్మూలించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, ప్రాజెక్టు స్థాయిలో ఐసీడీఎస్ సీడీపీఓలు, మండల స్థాయిలో తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామస్థాయిలో ఈఓఆర్‌డీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, బాధ్యులుగా ఉంటారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేయవచ్చు. బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే ఇబ్బందుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిస్తే బాల్య వివాహాలను అరికడతాం.

\- శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ



ఎర్రగుంట్లలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న తహసీల్దార్ శోభన్‌బాబు (ఫైల్)

సబ్‌జైలులో జీవిత ఖైదీ హల్‌చల్ !

- గాజుపెంకులతో శరీరమంతా గాయం

కడపక్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సబ్‌జైలులోని ఓ జీవిత ఖైదీ శనివారం హల్‌చల్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాలిలా.. కడప సెంట్రల్ జైలులో గత కొన్నేళ్లుగా తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. అయితే అక్కడే శిక్ష అనుభవిస్తున్న మరో ఇద్దరి వద్ద సెల్‌ఫోన్ ఉండడంతో వారితో మాట్లాడి వచ్చినట్లు సమాచారం. దీంతో విధుల్లో ఉన్న వార్డెన్ వారితో నీకేం పని అని మందలించినట్లు తెలిసింది. కాగా ఆ నిందితుడు సిబ్బందిపై ఎదురుతిరగడంతో వారు అతనిపై దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా మనస్థాపానికి గురైన ఆ నిందితుడు జైలు ప్రధాన ద్వారం వద్ద ఉన్న కిటికీకి ఉన్న గాజు అద్దాన్ని పగులగొట్టి గాజు ముక్కలతో శరీరమంతా కోసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో జైలు అధికారులు చికిత్స నిమిత్తం అతన్ని రిమ్స్‌కు తరలించి వైద్య పరీక్షలు చేయించినట్లు సమాచారం. ప్రస్తుతం సెంట్రల్ జైలులోనే చికిత్స తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జైలు పర్యవేక్షణ అధికారి రాజేశ్వరరావును వివరణ కోరగా ఖైదీని తమ సిబ్బంది కొట్టలేదని, అతను గాజుతో కూడా కోసుకోలేదని, ఖైదీకి ఎలాంటి గాయాలు కాలేదని చెప్పుకొచ్చారు.

చామంతి సాగు.. ఆదాయం బాగు

సీకేదిన్నె మండలం ఊటుకూరు పొలాల్లో సాగు చేసిన చామంతి



జడ్పీ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న పెట్టు బాలయ్య రైతు కుటుంబం నుంచి వచ్చాడు. ఈయనకు వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో ఐదెకరాలలో చామంతి, బంతిపూలను సాగుచేశారు. ఆధునిక పద్ధతులను పాటించి ఎకరాకు 5 నుంచి 6 టన్నుల దిగుబడి సాధించాడు. ఇందుకు తగ్గట్లుగా ధరలు ఉండడంతో ఖర్చులు పోనూ రూ.20 లక్షల ఆదాయాన్ని పొందాడు. ఈ ఏడాది కూడా జిల్లాలో గిట్టుబాటు ధరలు ఉండడంతో ప్రతి రైతు ఇంచుమించు అదేరీతిన ఆశించిన లాభాలనే పొందుతున్నారు. ధరలు నిలకడగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- చామంతి రైతులకు మంచిరోజులు
- ఎకరాకు రూ.4 లక్షల ఆదాయం
- కిలో రూ.80 నుంచి రూ.100
- 1800 ఎకరాల్లో పంట సాగు
- నిలకడగా ధరలు

కడప రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పూలసాగు చేపట్టిన రైతన్నలకు మంచి రోజులు నడుస్తున్నాయి. దిగుబడులతో పాటు ఆశించిన ధరలు ఉండడంతో కాసుల వర్షం కురుస్తోంది. 2024 సెప్టెంబరులో నాటిన చామంతి, బంతిపూల సాగు ఫిబ్రవరితో ముగిసింది. ఈ మధ్యకాలంలో పూలధరలకు రెక్కలొచ్చాయి. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి లాంటి ప్రముఖ పండుగలతో పాటు ఇతర జిల్లాల్లో అధిక వర్షాలకు పంటలు దెబ్బతినడంతో చెన్నై, తిరుపతి, బెంగళూరు, విజయవాడ, హైదరాబద్ లాంటి మార్కెట్లకు తగిన దిగుబడులు రాకపోవడంతో కిలో రూ.130 నుంచి రూ.180ల వరకు ధర పలికింది. వెరసి జిల్లాలోని చామంతి రైతులకు ఖర్చులు పోనూ ఎకరాకు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయాన్ని పొందారు. తరువాత అక్టోబరు నెలలో నాటిన పూలసాగు ప్రస్తుతం కోతలు వస్తున్నాయి. ఇప్పుడు ధరలు కాస్త తగ్గినా కిలో రూ.80ల నుంచి రూ.100లు మేర గిట్టుబాటు ధరలు ఉండడంతో రైతులు ఆశించిన ఆదాయం పొందుతున్నారు. గత ఏడాది పూల దిగుబడులకు మార్కెట్‌లో సరైన ధరలు లేక నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఆ నష్టాలను రైతులు ఇప్పుడు తీర్చుకుంటూ ఊరట చెందుతున్నారు. అయితే ఈ ధరలు ఎంతకాలం నిలుస్తాయో ప్రశ్నార్థకంగా ఉందంటున్నారు. గత కొంతకాలం నుంచి పూలకు మంచి ధర పలుకుతోంది. మార్కెట్‌కు విక్రయానికి వచ్చే దిగుబడులను బట్టి ధరల ప్రభావం నడుస్తుందని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

1800 ఎకరాల్లో పంట సాగు

జిల్లాలో 1800 ఎకరాల్లో చామంతి, బంతి తదితర పూలను సాగుచేశారు. ఇందులో ఖరీఫ్‌లో 1400 ఎకరాలు, రబీలో 400 ఎకరాల మేర ఖాజీపేట, వేముల, చెన్నూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వేంపల్లె, దువ్వూరు, బ్రహ్మంగారి మఠం, పోరుమామిళ్ల, లింగాల మండలాల్లో సాగైంది. సాగు చేసిన రైతులు ఖర్చులు పోనూ రూ.72 కోట్ల వరకు ఆదాయాన్ని పొందారు.

సాగు ఖర్చు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలు

ఎకరా పొలంలో పంట పెడితే దిగుబడి వచ్చే వరకు రూ.1 నుంచి 1.5 లక్షలు ఖర్చు చేయాలి. నారు ఒక్కో మొలక రూ.2ల చొప్పున ఎకరాకు 50 వేలు, ఎరువులకు, పురుగు మందుల పిచికారీకి మరో 50 వేలు, డ్రిప్‌కు, దిగుబడి మొదలయ్యాక కూలీల ఖర్చు, రవాణా ఖర్చు కలిపి ఇంకో రూ.50 వేల చొప్పున మొత్తం ఒక లక్ష 50 వేల వరకు రైతు ఖర్చు చేయాల్సి ఉంది. ఒక ఎకరాకు 5 నుంచి 6 టన్నుల (6వేల కేజీలు) వరకు దిగుబడి వస్తుంది. ఒక కిలో సరాసరిన రూ.100ల ధరతో పోలిస్తే రైతుకు పెట్టుబడి పోనూ దాదాపు రూ.3 నుంచి 4 లక్షల వరకు ఆదాయం సమకూరింది. 5 నెలల పంట కాలపరిమితిలో ఇంచుమించు ఏడాదికి రెండు, మూడు పంటలను సాగుచేస్తున్నారు.

లాటరీగా మారిన పూల ధర

రైతుకు పూల ధర లాటరీగా మారింది. ధర ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. గత రెండు సంవత్సరాల్లో పెట్టుబడులు కూడా రాలేదు. పొలాల్లోనే వదిలేసి సేద్యాలు చేశారు. ఈ సారి ఇందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. పూల ధరలు అమాంతంగా ఎగబాకి ప్రస్తుతం నిలకడగా నడుస్తున్నాయి. దీంతో ఒక ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

625 ఎకరాలకు సబ్సిడీ

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 5 ఎకరాలలోపు పూలసాగు చేసిన 625 మంది సన్న, చిన్నకారు రైతులకు ఒక్కొక్కరికి రూ.16 వేల చొప్పున సబ్సిడీ అందించింది. ఇందులో చామంతి పూల సాగుకు సంబంధించి సిద్దవటం మండలంలో 54.38 హెక్టార్లు సబ్సిడీ అందించి అగ్రస్థానంలో ఉండగా ఖాజీపేటలో 1.5 హెక్టార్లు, పులివెందులలో 5.58 హెక్టార్లు, వేములలో 44.99 హెక్టార్లు, చెన్నూరులో 31 హెక్టార్లు, ఒంటిమిట్టలో 45.41 హెక్టార్లు, చింతకొమ్మదిన్నెలో 13.19 హెక్టార్లు, పెండ్లిమర్రిలో 28.35 హెక్టార్లు, వేంపల్లెలో 30.44 హెక్టార్ల వరకు అందించారు. అలాగే సంపంగి పూలసాగుకు సంబంధించి దువ్వూరులో 5.59 హెక్టార్లు, ఖాజీపేటలో 3.35 హెక్టార్లు, చింతకొమ్మదిన్నెలో 2.25 హెక్టార్లు, అలాగే బంతిపూల సాగుకు సంబంధించి దువ్వూరులో 0.47 హెక్టార్లు, బ్రహ్మంగారిమఠంలో 1.00 హెక్టార్లు, పోరుమామిళ్లలో 6.15 హెక్టార్లు, ఖాజీపేటలో 0.84 హెక్టార్లు, లింగాలలో 0.84 హెక్టార్లు, సిద్దవటం 3.02 హెక్టార్లు, అలాగే గులాబీ పూలసాగుకు సంబంధించి దువ్వూరులో 0.25 హెక్టార్లు, బ్రహ్మంగారిమఠంలో 1.52 హెక్టార్లు మేర మొత్తం 625 ఎకరాలకు అందించారు.

సంతోషంగా ఉంది..



నాకున్న వ్యవసాయ పొలంలో 5 ఎకరాలలో గత సెప్టెంబరులో చామంతి పూలను సాగు చేశాను. డిసెంబరు చివర నుంచి కోతలు రావడంతో ఆశించిన లాభాలను పొందాను. సంక్రాంతి పండుగ సమయంలో కిలో రూ.180ల వరకు ధర వచ్చింది. దీంతో 5 ఎకరాలకు ఖర్చులు పోనూ రూ.20 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఆశించిన మేర ధరలు ఉండడంతో కష్టానికి ఫలితం లభించింది.

\- పెట్టు బాలయ్యయాదవ్, జడ్పీ వైస్‌చైర్మన్, రైతు

ఎకరాకు రూ.16 వేల చొప్పున సబ్సిడీ..



చామంతి, బంతి, సంపంగి, గులాబీ పూలసాగు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. 5 ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులను ఒక్కొక్కరికి రూ.16 వేల చొప్పున ఈ ఏడాది 625 ఎకరాలకు అందించి కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులను అన్నివిధాల ప్రోత్సహిస్తున్నాం. పూలసాగు చేసిన రైతులతో వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి తగిన సాంకేతిక పరిజ్ఞానంతో క్వాలిటీ మెటీరియల్ దిగుబడులను సాధింపచేస్తూ మార్కెట్ ధరలను తెలియజేస్తున్నాం. దీంతో జిల్లాలోని పూలకు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో మంచి ధర లభిస్తోంది.

\- సుభాషిణి, జిల్లా అధికారి, ఉద్యానశాఖ

పుట్టింటికి చేరిన గంగమ్మ

● ముగిసిన జాతర ● కిక్కిరిసిన భక్తులు ● అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు





జాతరలో జనసందోహం (ఇన్‌సెట్) అమ్మవారికి బోనం సమర్పిస్తున్న బాలిక

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పేరెన్నిక గన్న అనంతపురం గంగమ్మజాతర ఆదివారం అమ్మవారు పుట్టింటికి చేరుకోవడంతో ముగిసింది. ఆదివారం మైలుతిరుణాల రెండవ రోజు లక్షల సంఖ్య లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.మొదటి నిండు తిరుణాల శనివారం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా కనిపించింది. శనివారం అర్ధరాత్రి 10 గంటల నుంచి భక్తుల రద్దీ పెరగడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. జాతర ప్రాంగణమంతా భక్తులతో కిటకిలాడింది. శనివారం రాత్రి 12 గంటల నుంచి అమ్మవారు ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న వారు కుంకుమ, చాందినీ బండ్లతో ఆలయ



గంగమ్మ అమ్మవారు

ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో అధికారి శ్రీనివాసులు, మంత్రి మండిపల్లె రాంప్రసాదు రెడ్డి, యువజన కమిటీ మండిపల్లె లక్ష్మీప్రసాదు రెడ్డి పర్యవేక్షించారు. జాలయ్యగారిపల్లెకు చెందిన కానాల గంగిరెడ్డి అన్నదానం చేశారు.శనివారం రాత్రి కర్ణాటకకు చెందిన మహిళలు ఆ డప్పు కళాకారులు అద్భుతంగా డప్పులు వాయించారు. చెక్క భజన, రేలారేలా, జబర్దస్త్, ఢీ జోడీ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం మైలు తిరునాళ రోజు అమ్మవారు తన పుట్టినిల్లైన కుర్నూతల చాగలగుట్టపల్లెకు వెళ్లిపోగానే జాతర ముగిసింది.

అమ్మవారి సన్నిధిలో వీఐపీలు

శనివారం రాత్రి రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి, మండిపల్లె నాగిరెడ్డి, చిట్టి, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ దంపతులు, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు, కడప మేయర్ సురేష్‌బాబు, ఆర్డీవో శ్రీనివాసులు , ఏఎస్పీ వెంకటాద్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు, దినేష్,ఆలయ ఈవో శ్రీనివాసులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సన్మానం చేశారు.

చెరుకులకు డిమాండ్

అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు చెరుకుల కొనుగోలుకు ఎగబడడంతో ఆయా ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. ఈ జాతరకు సుమారు 4 లక్షల మంది భక్తులు రాగా, కనీసం 2 లక్షల మంది చెరుకులు కొనుగోలు చేసి ఉంటారని అంచనా.

అంధుల అక్షర ప్రదాత లూయీ బ్రెయిలీ



బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు

వాల్మీకిపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అంధులకు అక్షర ప్రదాత సర్ లూయీ బ్రెయిలీ అని రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వాల్మీకిపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో లూయీ బ్రెయిలీ విగ్రహావిష్కరణలో ఆయన మాట్లాడుతూ ఆయన రూపొందించిన లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు.

స్థానిక గ్రంథాలయంలో అంధుల సౌకర్యార్థం బ్రెయిలీ పుస్తక విభాగం ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ఏపీ గ్రంథాలయాల డైరెక్టర్ కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు రవీంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, సబితరాణి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, లైబ్రేరియన్ పసుపులేటి రమాపతి, హెచ్‌ఎం శ్రీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ గోవింద్, సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అంధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా..



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జావేద్

కడప క్రైం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారికి 1వ తేదీనుంచే కొత్త జరిమానాలు అమలులోకి వచ్చాయని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. నగరంలోని రైతు బజార్ సర్కిల్ వద్ద ఆదివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుంటే రూ. 5వేలు, మద్యం తాగి నడిపితే రూ.10వేలు, హెల్మెట్ లేకుంటే రూ వెయ్యి లేదా 3 నెలలు లైసెన్స్ రద్దు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్‌కు రూ.1500, రెండవ సారి దొరికితే రూ 10వేలు. ఇన్సూరెన్స్ లేకుంటే రూ. 2000, రెండవ సారి అయితే 4వేలు విధిస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బండతో కొట్టి కాపలాదారు హత్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

నంబేపల్లె, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సిమెంటు బస్తాలకు కాపలాగా ఉన్న వ్యక్తి హత్యకు గురైనట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముద్దినేని వడ్డెపల్లెకు చెందిన తిరుపతి వారాది (77) అనే వ్యక్తి వడ్డిపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో నిల్వ చేసిన సిమెంటు బస్తాలకు కాపలాగా శనివారం రాత్రి అక్కడ నిద్రించాడు. ఆదివారం ఉదయం ఆలయ పూజారి రక్తపు మడుగులో పడి ఉన్న అతని మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందజేశాడు. వారి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులు బండరాతితో అతని తలపై కొట్టి హత్య చేసినట్లు గుర్తించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ప్రమాద స్థలం నుంచి వడ్డెపల్లె వరకు వెళ్లిన కుక్కలు అక్కడి నుంచి వెనుదిరిగినట్లు సమాచారం. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఈ కేసులో నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, పోలీసు అధికారులను ఆదేశించారు. సంఘటన స్థలాన్ని పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఆస్తి కోసం వృద్ధుడిపై విష ప్రయోగం



చికిత్స పొందుతున్న సుగాలి చిన్నబిడ్డ

మదనపల్లె అర్బన్/కురుబలకోట, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం సొంత తమ్ముడి కుటుంబ సభ్యులు ఓ వృద్ధుడికి క్రిమి సంహారక మందు తాగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కురుబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన సుగాలి చిన్నబిడ్డ అనే వృద్ధుడు తన పేరిట ఉన్న 0.35 సెంట్ల డీకేటీ భూమి ఉంది. ఆ భూమిని తన కోడలు రమణమ్మ పేరిట మార్చాలంటూ అందుకు సంబంధించిన పత్రాలతోపాటు, ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు నగదును తన తమ్ముడి కుమారుడు నరసింహులు నాయక్‌కు ఇచ్చాడు. అయితే, నరసింహులు నాయక్ ఆ పత్రాల ఆధారంగా తన భార్య శారద బాయి పేరుతో ఓసారి, సుందరబాయి అనే పేరుతో మరోసారి నకిలీ పత్రాలను సృష్టించుకున్నాడు. ఈ విషయమై కొన్ని రోజులుగా రెండు కుటుంబాల మధ్య చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం నరసింహులు నాయక్ తన పెదనాన్నను ఇంటికి పిలిచి దాడి చేయడంతో పాటు, తన తమ్ముడు వెంకటరమణ నాయక్, భార్య శారదబాయితో కలసి క్రిమి సంహారక మందు కలిపిన మద్యాన్ని బల వంతంగా తాగించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు అపస్మారక స్థితిలో పడిఉన్న వృద్ధుడిని స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. గత నెల 21న తన ఇంట్లో చోరీ జరిగినట్లు బూచిపల్లె వాసి బసప్పగారి వినాయకం పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఇదే గ్రామానికి చెందిన సతీష్‌ను నిందితుడిగా గుర్తించారు. ఎవరూ లేని సమయంలో వినాయకం ఇంట్లోకి ప్రవేశించిన సతీష్ బీరువా తాళాలు తీసి నగలు అపహరించాడు. కానగమాకులపల్లె వద్ద ఉన్న సతీశ్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ల్యాప్‌టాప్ అప్పగింత



బ్యాగును మురళికి అప్పగించిన సీఐ ఓబులేసు

కడప(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి):ఆటోలో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను చిన్నచౌకు పోలీసులు దాని యజమానికి అప్పగించారు. మాచర్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మురళి ఆదివారం కడపకు వచ్చాడు. ఆటోలో అప్సరా సర్కిల్ వద్దకు వచ్చిన ఆయన హడావుడిగా ఆటో దిగి వెళ్లిపోయాడు. కొద్దిదూరం వెళ్లాక ల్యాప్‌టాప్ బ్యాగును ఆటోలో మరచిపోయినట్లు గమనించి, చిన్నచౌకు సీఐ ఓబులేసును ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు సీసీ ఫుటేజ్ ద్వారా ఆటో ఆచూకీని పోలీసు సిబ్బంది గుర్తించారు. ల్యాప్‌టాప్ బ్యాగును స్వాధీనం చేసుకుని దాని యజమానికి అప్పగించారు.

కుమారుడు కన్పించలేదని ఫిర్యాదు

పోరుమామిళ్ళ మార్చి2 (ఆంధ్రజ్యోతి):తమ కుమారుడు కనిపించడం లేదని కొట్టాలపల్లెకు చెందిన మండేల రామయ్య ఫిర్యాదు చేశాడని ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు.తన కుమారుడు వెంకటరామయ్య కనిపించకపోవడంతో నెల రోజులుగా బంధువులు, స్నేహితుల వద్ద విచారించామని, ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పోరుమామిళ్ళ పరిసర ప్రాంతాలలో, పబ్లిక్ స్థలంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదగాలి

● మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

మదనపల్లె అర్బన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఆర్థిక ఎదుగుదలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం నిర్వహించాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సూచించారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ఆయన ఆర్యవైశ్య హాస్టల్‌లో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. టీటీడీలో ఆర్యవైశ్యుల కోసం మండపం ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం ఆర్యవైశ్యులు జనరల్ కేటగిరీలో ఉన్నారని ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు ఏమీ రావన్నారు. వృత్తిని బట్టి కులాలు ఏర్పాటు చేశారని, వృతిపరంగా ఆర్యవైశ్యులు వ్యాపారులే అని చెప్పారు. ప్రస్తుతం వృత్తులు మరుగున పడిపోయాయని వివరించారు. రాజకీయంగా ముందుకు వెళ్లడానికి అన్ని వర్గాల వారి సహకారం అందుకోవాలన్నారు. మదనపల్లెలో ఏదైనా యూనిట్ పెట్టడానికి తనవంతుగా కోటి రూపాయలు సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు తన తనయుడు కృషి చేస్తాడని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. గతంలో కూడా వారికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పార్థసారధి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, నేతలు నరసింహులు, మదనపనల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, దేవతా సతీష్, సూరేగిరిధర్, బీజేపీ రాజంపేట జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయం

నిమ్మనపల్లి మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయమని అన్నమయ్య జిల్లా సహకార సంఘ శాఖాధికారి గురుప్రకాష్ తెలిపారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన సహకార వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వున్న సహకార సంఘాల్లోని రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అన్ని సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.
మహిళా సహకార యోజన, రైతులకు పంటలపై అవగాహన, మహిళా సమాఖ్యకు సొసైటీ బ్యాంకు ద్వారా అందించే ఋణాలు, డీసీసీబీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్‌పై అవగాహన, కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా చేనేత కార్మికులకు రుణాలు, ఫిషరింగ్‌పై అవగాహన, విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం, వన మహోత్సవం వంటి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు సంఘాలను ఇప్పటికే కంప్యూటరైజ్ చేశామని, వీటితో పాటు జనఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీఎల్‌డీసీ శ్యాంప్రకాష్, అన్నమయ్య జిల్లా ఎస్‌డీఎల్‌సీఓ ఆనంద్, అచ్యుతాదేవి, ప్రకాష్‌కుమార్ సీఈఓ హరినాథ్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి సహచర సిబ్బంది దీప, స్వర్ణలత పాల్గొన్నారు.

తండ్రిని పరామర్శించి వస్తూ తిరిగిరాని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి.. భర్తకు తీవ్ర గాయాలు





ప్రమాదంలో మృతి చెందిన శారద తీవ్రంగా గాయపడిన మాధవరెడ్డి

వాల్మీకిపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని పరామర్శించి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కురబల కోట మండలం ముదివేడు గ్రామ పంచాయతీ అడవిపల్లెకు చెందిన శారద శనివారం తన భర్త మాధవరెడ్డితో కలిసి తిరుపతి రుయా ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి చంద్రశేఖర్‌రెడ్డిని చూసేందుకు వెళ్లింది. అదే రోజు రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా విఠలం సమీపాన వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శారద మృతి చెందగా భర్త మాధవ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మాధవరెడ్డిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లెకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



సుధాకర్ (ఫైల్)

రాయచోటిటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కలకడ మండలం ఎనుగొండ పాలెం గ్రామం దిగువపాలేనికి చెందిన సుధాకర్ (50) పండ్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంటాడు. నిమ్మ కాయల కొనుగోలుకు ఆదివారం రాయ చోటికి వచ్చిన ఆయన స్వగ్రామానికి తిరిగి వెళు తుండగా పట్టణ పరిధిలోని చిత్తూరు రింగు రోడ్డుకు సమీపంలో కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

విద్యుదాఘాతంతో ఒకరు..



నీటిలో నాగరాజు మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్త బస్వాపురంలో ఆదివారం చోటుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కొత్త బస్వాపురం గ్రామానికి చెందిన తొర్రివేముల నాగరాజు (30) ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బ్రహ్మసాగర్ ప్రాజెక్టుకు సమీపాన వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్కడి వంకకు దగ్గలోని పొలం వద్ద అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తగిలి మృత్యువాత పడ్డాడు. ఏఎస్‌ఐ గురప్ప విచారణ చేస్తున్నారు.

అత్త,మామపై అల్లుడి పైశాచిక దాడి



చికిత్స పొందుతున్న గంగాధర్, లక్ష్మీనరసమ్మ

పెద్దతిప్పసముద్రం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కన్నకూతురుని కొడుతున్న అల్లుడి బారి నుంచి అడ్డుకోబో యిన అత్తమామపై అల్లుడు పైశాచికంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితులు, స్థానికులు అం దించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలం బూచిపల్లెకు చెందిన గంగాధర్, లక్ష్మీనరసమ్మ దంపతులకు గాయత్రిని ఇదే గ్రామానికి చెందిన విజయ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నెల కూడా తిరగకుండానే గాయత్రిని అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అల్లుడు తన కూతురిని కొడుతుండగా మామ గంగాధర్, అత్త లక్ష్మీనరసమ్మ వెళ్లి అడ్డుకున్నారు. కోపోద్రిక్తుడైన అల్లుడు వారిపై పైశాచిక దాడికి పాల్పడ్డాడు. మామకు ముక్కు కోసి తీవ్రంగా గాయపరచగా, అత్తకు కాళ్లు చేతులు విరిచి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన వీరిని కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె ఆస్పత్రి లో లక్ష్మీనరసమ్మకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుం బ సభ్యులు తెలిపారు. జరిగిన ఈ సంఘటనపై పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలం విషయంలో వివాదం..యువకుడిపై దాడి

పులివెందుల టౌన్ మార్చి 2, (ఆంధ్రజ్యోతి): పొలం గట్టు విషయమై ఘర్షణలో మణి కంఠ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన సాదక్ వల్లి, అక్బరమ్మ కొడవలితో దాడి చేశారు. మణికంఠ, సా ధక్ వలి మధ్య పొలం గట్టు విషయమై గతంలోకూడా ఘర్షణలు జరిగాయి. ఆదివారం పొలం వద్ద మట్టిని తోలకూడదని వారించినందుకు మణికంఠపై వారు కొడవలితో దాడి చేశారు. గాయాలపాలైన మణికంఠను చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు.
ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ వెల్లడించారు.

తూనికలు, కొలతల శాఖ దాడులు

● ఎండీయూ వాహన నిర్వాహకుడికి జరిమానా

మదనపల్లె, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్త ఇండ్లులోని అర్బన్ చౌకదుకాణం 44కు జరిమానా విధించారు. రేషన్‌కార్డుదారులకు బియ్యం తూకం కంటే తక్కువగా ఇస్తున్నారని ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి కొత్త ఇండ్లు, రంగారెడ్డి కాలనీల్లో మకాం వేసి పరిశీలించారు. ఇందులో 25కిలోలకు కిలో, 10కిలోలకు 300 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎండీయూ వాహన నిర్వాహకుడు చంద్రశేఖర్‌కు రూ.10 వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. ఈయన కార్డుదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, కొందరికి అన్ని సరుకులు ఇవ్వడం లేదని, చా లా మందికి బియ్యం బదులు డబ్బు ఇస్తున్నాడని ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహిం చి పట్టుకున్నారు. జగనన్న కాలనీ, మరో ప్రాంతంలోనూ రెండు ఎండీయూ వాహనాలపై తనిఖీ చేసే క్రమంలో అక్కడి నుంచి వెళ్ళిపోయాయని తెలిసిం ది. పట్టణంలోని మరో రెండు సెల్‌ఫోన్ దుకాణాలు, హార్డ్‌వేర్, స్వీట్ దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.40వేలు జరిమానా విధించారు. ఇందులో కంపెనీ పేరు, తయారీదారుడు, ఎమ్మార్పీ ధరలు లేకపోవడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారంపై తూనికలు, కొలతల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నా రు. నిబంధనల ప్రకారం గడువు ముగిసినా ఎండీయూ వాహనదారులు వేయింగ్ మిషన్లకు సీల్ వేయించుకోలేదని తెలిసింది. కొందరు ఎండీయూలే రేషన్ డీలర్ల అవతారమెత్తి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఇటీవల రాయచోటిలో జేసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని చర్చ జరిగినట్లు సమాచారం.

నగరంలోని ఐదో డివిజన్ అశోక్‌నగర్ వద్ద ఉన్న బస్‌షెల్టరు అధ్వానంగా ఉంది. బద్వేలు-రాజం పేట వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో పాటు పలు వురు ప్రయాణికులు ఈ బస్టాప్ వద్ద వేచివుం టారు. ఇంతవరకు బాగానే వుంది.. కానీ వేచి వుండటమే పెద్ద సమస్యగా మారింది. ఇక్కడ వచ్చే దుర్గంధాన్ని భరించడం ప్రయాణికులకు ఇబ్బందిగా తయారైంది. బస్‌షెల్టరు పక్కనే మురుగుకాల్వ ఉంది. అంతేకాకుండా చుట్టుపక్క ల నివాసాలు ఉన్నవారు చెత్తాచెదారం అక్కడే వేయ డంతో మరింత వాసన వస్తోంది. పైగా బస్సుషెల్టరు కూడా తుప్పుపట్టి రంధ్రాలు ఏర్ప డ్డాయి. అధికారులు దృష్టి సారించి బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేసి మురుగు కాల్వను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు.

కడప క్రైం - ఆంధ్రజ్యోతి



మోక్షం ఎప్పుడు..?

ప్రారంభానికి నోచుకోని వేంపల్లి బస్టాండ్

వేంపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒకవక్క కోట్లాది రూపాయలతో నిర్మించి పూర్తైన వేంపల్లె బస్టాండ్ ఉండగా అక్కడ అన్ని హంగులు ఉన్నా లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతర ఉన్నందున బస్టాండ్ వద్ద టెంటు వేసుకొని బయటే ప్రయాణికులను ఎక్కించుకున్నారు. పులివెందుల డిపో ఆధ్వర్యంలో వేంపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె గంగమ్మజాతరకు ప్రత్యేక బస్సులు ప్రతిఏడాది ఏర్పాటుచేస్తారు. బస్టాండ్ బయట ఆర్టీసీ సిబ్బంది టెంటు వేసుకొని బయటే ప్రయాణికులను ఎక్కించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎండలోనే ప్రయాణికులు రోడ్లపై పడిగాపులుకాచి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ప్రయాణికులకు తప్పలేదు. మరోవైవు మరుగుదొడ్లు ఉన్నా ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంది. అన్ని హంగులు ఉన్నా బయట నుంచి ట్రాఫిక్ సమస్యతో బస్సులు నడవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.



నూతన బస్టాండ్ పూర్తయినా ముందువైపు టెంటు వేసుకున్న ఆర్టీసీ సిబ్బంది



వేంపల్లె నూతన బస్టాండ్ ప్రారంభం కాకపోవ డంతో రోడ్డుపై ఎండలో నిల్చుని బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

ఓపీఎస్ సాధన ఏకైక లక్ష్యం

కడప ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ పింఛన్ విధానం సాధనే ఏకైక లక్ష్యమని డీఎస్సీ 2003 ఫోరం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కడప నగరం జడ్పీ ఆవరణంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్సీ 2003 ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

నూతన కార్యవర్గం: డీఎస్సీ 2003 ఫోరం నూతన జిల్లా అధ్యక్షుడుగా తిరుపాల్, ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయభాస్కర్, కోశాధికారిగా కె.సుధాకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్

వేంపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి గా తోటంశెట్టి చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అమ్మ వారిశాలలో ఏర్పాటుచేసిన ఆర్యవైశ్యుల కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు ఎంపికయ్యారు. మార్చి 9న అమ్మ వారిశాలలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించ నున్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషిచేస్తానని నూతన అధ్యక్షుడు తెలిపారు.

మహిళలు ఆత్మ రక్షణకు స్వశక్తి కలిగి ఉండాలి :ఎస్ఐ

సింహాద్రిపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో మహిళలు ఆత్మ రక్షణకు స్వశక్తి కలిగి ఉండాలని సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ పేర్కొన్నారు. ఉమెన్స్ డే కార్యక్రమంలో భాగంగా ఆదివారం సింహాద్రిపురంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించడం హర్షణీయం

వేంపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తల (ఆశా కార్యకర్తలు) సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, 30ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారికి పదవీ విరమణ తర్వాత రూ.1.50లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. కాగా అంగన్వాడీల సమస్యలను కూడా పరిష్కరించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

హాస్టళ్ల తనిఖీ

వేంపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని పలు పాఠశాలల హాస్టళ్లను సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ తిరుపాల్‌నాయక్ సందర్శించారు. మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా మెయిన్ బజార్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్, చైతన్య హైస్కూల్ హాస్టల్, స్వామివివేకానంద హైస్కూల్ హాస్టల్, నారాయణ హైస్కూల్ హాస్టల్ తదితర వాటిని సందర్శించి అక్కడ ఉంటున్న విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రధానంగా మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటిసమస్య ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజెప్పాలన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి

లింగాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ రసాయన ఎరువులు, పురుగుమందులను ఉపయోగించడం క్రమంగా తగ్గించాలని న్యాచురోపతి వైద్యులు రామాంజనేయరెడ్డి, షణ్ముఖ, హనూఫ్ అన్నారు. మండలంలోని బోనాల గ్రామంలో ఆదివారం ప్రజల కోసం ఆరోగ్యం, విద్య, వైద్యంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో న్యాచురోపతి గుంతకల్లు మెడికల్ కళాశాల వైద్యులు, వేంపల్లె ఉద్యాన అధికారి రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలపై వరాల జల్లు హర్షణీయం

కడప మారుతీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఆశా వర్కర్స్‌కు ఇచ్చిన హామీ మేరకు చంద్ర బాబు వరాల జల్లు కురిపిం చడం హర్షణీయమని ఏ.పీ. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి, జిల్లా గౌరవాధ్య క్షులు గుంటి వేణు గోపాల్, మహిళా అధ్యక్షురాలు మరియమ్మ పేర్కొన్నారు. ఆశా కార్యకర్తల సేవలను గుర్తించి గ్రాట్యుటీ క్రింద 1.50 లక్షల వరకూ లబ్ధి చేకూర్చడం సంతోషంగా ఉందన్నారు. ఆ మేరకు ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్నికైన నూతన కమిటీలతో సమాఖ్య ప్రతినిధులు

కడప కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్చక, పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అర్చక, పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ స్పష్టం చేశారు. సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరసింహ మూర్తి, పి. నారాయణమూర్తి, టీ.సునీల్‌శర్మ, దుర్గాబాబు ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక మృత్యుంజయకుంట శివాలయంలో నగర అర్చక పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నూతన జిల్లా, నగర కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా జిల్లా కోశాధికారిగా నరసింహభట్టర్, యువజన అధ్యక్షుడుగా కె. గౌతమ్‌శర్మ, అధికార ప్రతినిధిగా నరసింహ, నగర అధ్యక్షుడుగా ఏ.సురేష్‌శర్మ, ప్రధానకార్యదర్శిగా జగదీష్‌శర్మ, కోశాధికారిగా ఎం.సాయికృష్ణస్వామి, నియమితులయ్యారు. నూతనంగా ఎంపికచేసిన వారికి జడ్డి పసుపులేటి శంకర్, సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రమౌళీశర్మ, అధ్యక్షుడు సత్యనారాయణశర్మ, ఆ ఆలయ ఈఓ శ్రీధర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి

కమలాపురం రూరల్ మార్చి 2, (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరగాళ్ళ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ ప్రజలకు సూచించారు. ఆదివారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ప్రజలకు దొంగతనాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని సంబంధిత ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి నిర్వహించి మాట్లాడారు. కాలనీలు, గ్రామాలలో దొంగతనాలు అరికట్టేందుకు పోలీసు అధికారులు జిల్లా వ్యాపితంగా అవగాహన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

కడపక్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో దినేష్ అనే యువకుడికి గాయాలైనట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో అతని కాలుకు టైరు తగిలి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

కడపక్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాతబస్టాండు వద్ద మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కడపకు చెందిన సిద్దారెడ్డి పాతబస్టాండు వద్ద 13 క్వార్టర్ బాటిల్స్ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నిఘా ఉంచి అతన్ని పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నెలరోజుల పాటు అన్నదానం

వేంపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఉపవాస దీక్ష విరమించేందుకు అన్నదానం (షెహరీ) చేస్తున్నారు. 19ఏళ్లుగా రంజాన్ ఉపవాస దీక్షలు చేసే వేంపల్లె వాసులకు, బయటి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు మైనార్టీ నాయకులు అబ్దుల్, ఫరూక్, అహ్మద్, రఫి, రిజ్వాన్, ఇస్మాయిల్ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఫోన్ చేస్తే ప్రయాణికులు ఉన్నచోటికే ఆహార ప్యాకెట్లను ఉచితంగా అందిచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరైన ఉపవాస దీక్షలను విరమించేవారు 9885445289, 7207178893 నెంబర్లను సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

'అబద్ధాలు నిరూపితమైనవి'

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అబద్ధాలు మరోమారు నిరూపితమైనవని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలు మేనిఫెస్టోలో చెప్పి ప్రజల్ని మోసం చేశారన్నారు. సంపద సృష్టిస్తారని ఆయన ఎక్కడ ఏ విధంగా సృష్టించారో తెలియని పరిస్థితి అన్నారు. టీడీపీ నేతలకు మాత్రమే సృష్టిస్తున్నట్లు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, నాగేంద్ర షఫి, రంజన్‌రెడ్డి, దత్తసాయి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is hereby inform to the public that my client's bank rept. by : Branch Manager, Union Bank of India, NGO Colony Branch, Kadapa has intended to sanction Home loan for below mentioned schedule property in favour of **Uppu Bharathi** she lost original link Doc. No. 391/ 1979, Dt. 01.02.1979 and 5152/ 1986, Dt. 16.07.1986. Somewhere and not trace out as per Police certificate, issued by C.I. (Chinna Chowk) P.S., Kadapa. So if anyone having objection against the property and same may be intimated to Branch Manager, Union Bank of India, NGO Colony Branch, Kadapa within 7 days for compliance. **SCHEDULE:-** YSR Kadapa District, Kadapa Urban Sub District, Kadapa Municipal Corporation area limits, at chinnachowk village fields in Sy.No. 676 an extent of Ac. 1-10 cents, in this an extent of Ac. 0-02 cents & 84 Sq. links and in Sy.No. 719 an extent of 262 sq. links total in these two survey numbers an extent of Ac 0-02 cents & 346 sq. links 123.33 sq. links within the following Boundaries : East : Road, West : V. Krishnamurthy joint wall and house, North : K. Narayana Reddy Vacant site, South : Public Road

G. VENKATESWARA REDDY
ADVOCATE, KADAPA, 9948092702

ఘనంగా గంగమ్మ జాతర





క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

సికెదిన్నె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మది న్నె గంగమ్మజాతర ఘనంగా జరిగింది. మహాశివ రాత్రి ముగిసిన అనంతరం మూడో రోజు నుంచి రెండు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. శని, ఆదివారాల్లో జాతరను భక్తులు ఘనంగా జరుపు కున్నారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వ చ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిం చారు. దీంతో క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. భ క్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ని ర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం అనంతరం భక్తుల కు తీర్థప్రసాదాలు అందించారు. వచ్చిన భక్తులకు దాతల సహాయంతో భారీగా అన్న దానం నిర్వహించారు. భక్తులను అలరించేందుకు కోలాటాలు నిర్వహించి కనువిందు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దాతలు మంచినీ రు, మజ్జిగ, పానకం అందించి భక్తులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించారు.

బర్డ్ ఫ్లూ మనుషులకు వచ్చిన దాఖలాలు లేవు

సూపర్‌స్పెషాలిటీ వెటర్నరీ హాస్పటల్ ఏడీ నరేంద్రరెడ్డి



పులివెందుల రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వైరస్ మనుషు లకు వచ్చిన దాఖలాలు లేవు. చికెన్, గుడ్లు తింటే బర్డ్‌ఫ్లూ వైరస్ మనుషులకు వస్తుందనేది ఫోబియా మాత్రమే. ఇప్పుడే కాదు ఎటువంటి పరిస్థితుల్లో అయినా, ఆహార పదార్థం ఏదైనా (చనిపోయినవి కాదు) బాగా ఉడికించిన ఆహారాన్నే తినాలంటున్న పులివెందుల సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హాస్పటల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రరెడ్డితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ఫటాఫట్

ప్రశ్న: బర్డ్‌ఫ్లూ వైరస్ ఎలా వచ్చింది, ఎలాసోకుతుంది, దాని ప్రభావం ఎంత?

జవాబు: సైబీరియాలాంటి దేశాల నుంచి వచ్చే వలసపక్షుల ద్వారా వచ్చినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బర్డ్‌ఫ్లూ (హెచ్1ఎన్5) వైరస్ గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉన్న పక్షులకు సోకుతుంది. పక్షులు ఒకేచోట గుమిగూడి ఉండడం వల్ల వాటికి ఎక్కువ వ్యాపిస్తుంది.పౌల్ట్రీఫాంలో బర్డ్‌ఫ్లూ ఎక్కువగా వ్యాపించి ఒకేసారి ప్రభావం చూపుతుంది.

ప్రశ్న: మనుషులకు ప్రమాదం జరుగుతుందనే వాదన వినిపిస్తోంది?

జవాబు: బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి వేలాది కోళ్లు మృతిచెందాయి. అయితే పౌల్ట్రీఫాం యజమానులకు గాని, కూలీలకు గాని, పరీక్షలు జరిపే డాక్టర్లకు గాని లేదా చుట్టుపక్కల ప్రజలకు సోకిన దాఖలాలు ఇప్పటి వరకు బయటపడలేదు. ఇది ఒక అపోహమాత్రమే.

ప్రశ్న: ప్రజలకు ఏ విధంగా ధైర్యం చెబుతారు?

జవాబు: వైరస్ 70డిగ్రీల వేడికి చనిపోతుంది. చికెన్, గుడ్లులాంటివి నీళ్లలో ఉడకపెట్టినప్పుడు 100డిగ్రీల వేడిలో ఉడికించి, నూనెలో వేయించినపుడు 100 నుంచి 140డిగ్రీల వేడిలో ఉడుకుతుంది. దీనితో హానికలిగించే బ్యాక్టీరియాలాంటివి చనిపోతాయి. అలాగని చనిపోయిన వాటిని తినకూడదు.

ప్రశ్న: ఇంట్లో పెంచుకునే పెంపుడు జాతులు ద్వారా అలర్జీలు వస్తాయా?

జవాబు: పెంపుడు జాతులు (కుక్కలు, పిల్లులు, పలు రకాల పక్షులు) ద్వారా అలర్జీలు వచ్చే అవకాశం లేదు.

ప్రశ్న: ఆసుపత్రిలో ఏ సౌకర్యాలు ఉన్నాయి?

జవాబు: పశువులకు సంబంధించి ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ యంత్రాలున్నాయి. రాష్ట్రంలో విజయవాడలో ఒకటి, పులివెందులలో ఒకటి ఇలాంటి సూపర్‌స్పెషాలిటీ వెటర్నరీ ఆసుపత్రులు ఉన్నాయి.

నేడు టీడీపీ నేత పీరయ్య అంత్యక్రియలు

కడప మారుతీనగర్ మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు పీరయ్య అంత్య క్రియలు ఈనెల 3వ తేదీ సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు కృష్ణ థియేటర్ సమీపంలోని యాకూబ్ సాబ్ మసీదు శ్మశాన వాటికలో జరుగనున్నాయి. కాగా అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లో వైద్యసేవలు పొందుతూ పీరయ్య మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని సోమవారం ఉదయం 6 గంటల నుంచి అంత్యక్రియలకు బయలుదేరే వరకూ రవీంద్ర నగర్‌లో ఉన్న పీరయ్య నివాస గృహం వద్ద ఉంచడం జరుగుతుందన్నారు. అంత్యక్రియలకు నందమూరి రామక్రిష్ణ హాజరుకానున్నట్లు సమాచారం.

పీరయ్య మృతి టీడీపీకి తీరని లోటు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు పీరయ్య మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు తెలిపారు. ఆదివారం పీరయ్య చిత్రపటానికి ఆయనతో పాటు టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జైకుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం ఉపాధ్యక్షుడు అల్లాబకాష్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రసాద్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి నివాళులు: పీరయ్య హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన పార్థివ దేహాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాదవి సందర్శించి నివాళుల ర్పించారు. వారితో పాటు యువనేత శ్రావణ్‌రాజ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం... హైవే కల్వర్టు గోడ

చెన్నూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నుంచి కడపకు వెళ్లే హైవే లో సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కల్వర్టు గోడ పలు ప్రమాదాలకు కారణమవుతోంది. రోడ్డుపైనే రాళ్లతో చిన్నపాటి గోడను రక్షణగా కట్టడంతో దారిన ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు ఇటీవలకాలంలో ఆ గోడను ఢీకొని పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. సాధారణంగా హైవేలో కల్వర్టుపై రక్షణ గోడ కట్టాలంటే తగిన సూచనలు తెలిపే విధంగా గోడ నిర్మించాలి. కానీ అలాంటి పరిస్థితి ఇక్కడ లేదు. తారురోడ్డు నలుపు, ఈ గోడ కూడా నలుపు రంగులో ఉండటంతో ఐదారు నెలలుగా పలు వాహనాలు ఈ గోడను ఢీకొన్నాయి. ఇటీవల ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న ఇద్దరు ఆ గోడను ఢీకొని ప్రమాదాలపాలయ్యారు. గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు ఎన్నో జరిగాయి. హైవే అధికారులు ఈ గోడను ప్రమాదాలకు నిలయంగా మార్చకుండా తగిన విధంగా రక్షణ కలిగే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నూరు సమీపంలో హైవేపై ప్రమాదాలకు నిలయంగా మారిన రక్షణ గోడ

మోరీని ఢీ కొని నలుగురికి గాయాలు

చెన్నూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు హైవేలోని సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మోరీని ఢీకొని నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన వీరకుమార్, విజయలక్ష్మిలతో పాటు మనోహర్, ప్రభావతి ఆదివారం కడపలోని ఓ శుభకార్యానికి వెళుతూ ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాల్లోని నలుగురూ గాయపడ్డారు. కాగా అదే సమయంలో కడపకు పలు వాహనాలు వెళుతుండడంతో ప్రమాదం తప్పింది. చాలా రోజులుగా మోరీని పక్కకు మార్చాలని ప్రజలు కోరుతున్నప్పటికీ హైవే అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో కూడా ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి.

సమస్యల వలయంలో 33వ వార్డు

● రూ.130 కోట్ల అభివృద్ధి పనుల్లోనూ ఆ వార్డుకు దక్కనిమోక్షం ● కాలనీలో దెబ్బతిన్న రోడ్లు , మురుగు కాలువలు లేని వైనం

బద్వేలు , మార్చి2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 33వ వార్డు సమస్యలతో సతమతమవుతోంది. పట్టణంలో 35 వార్డులుండగా గత వైసీపీ పాలనలో బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.130 కోట్ల నిధులను కేటాయించారు. అయితే ప్రధానంగా 33వవార్డులో టీడీపీ కౌన్సిలర్ ఉండడంతో అక్కడ నిధులు వెచ్చించక ఆపార్టీ అనుయాయులు కావాలని నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధి కుంటుపడింది. 33వ వార్డు పరిధిలో గాండ్లవీధి, రెడ్డెయ్య మఠం వీధి, పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు, పప్పులవీధిలో కొంత భాగం, బంకాపాళెం, ఎగువపాళెం, దిగువ పాళెం మూడు దళితవాడలు ఉన్నాయి. దాదాపు 2,500 పైగా జనాభా ఉన్న ఈ వార్డులో అన్ని ప్రాంతాలలో ఏదో ఒక సమస్య నెలకొంది. అందులో ప్రధానంగా సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా రెడ్డెయ్య మఠం వీధిలో ఎప్పుడో 30 ఏళ్ల కిందట నిర్మించిన సిమెంటు రోడ్డు దెబ్బతిని మట్టి రోడ్డుగా తయారైంది.ఈ దారి నుంచి కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు మైదుకూరు రోడ్డులోని బ్యాంక్‌లకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు లో వర్షాకాలంలో నడిచి వెళ్లేందుకు పాదాచా రులు సైతం జంకుతున్నారు. వార్డు పరిధిలోని ఎస్ఎల్ ఎన్ సినిమా హాలు వెనుకవైపున దాదాపు 60 నివాస గృహాలున్నప్పటికీ ఆ ప్రాంతంలో సిమెంటు రోడ్లు , మురుగు కాలువలు చేపట్టాలన్న ఆలోచన పాల కులకు కలుగలేదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వార్డు పరిధిలో బంక పాళెం, ఎగువపాళెం, దిగువ పాళెం అనే మూడు దళితవాడల్లో దాదాపు 500 మంది నివాసం ఉంటున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నారు.



మట్టి తేలిపోయిన రెడ్డెయ్యమఠం రోడ్డు

సరైన రోడ్లులేక ఎన్ని సమస్యలో..?



వార్డు పరిధిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్లపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సిమెంటు రోడ్లు వేయాలంటూ పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి ఆదుకోవాలి.
-యారవ నాగరాజు, 33వవార్డు బద్వేలు

సిమెంటు రోడ్లు వేయండి



ఎప్పుడో 30 సంవత్సరాల కిందట రెడ్డెయ్యమఠం వీధిలో వేసిన రోడ్లు దెబ్బతిన్నాయి. రద్దీగా తిరిగే ఈ ప్రాంతంలో వర్షాకాలం వచ్చిం దంటే నడిచేందుకు కూడా వీలు ఉండదు. గతుకుల రోడ్లు చూస్తుంటే మున్సిపా లిటీ లోనే ఉన్నామా అన్న ఆలోచనకలుగుతుంది.
-గడియారం నారాయణ శాస్త్రి , రెడ్డియ్యమఠం వీధి, బద్వేలు

మహిళా చట్టాలపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ



ఆటల పోటీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

ముద్దనూరు మార్చి2(ఆంధ్రజ్యోతి):స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని, వారోత్సవాల్లో భాగంగా సీఐ దస్తగిరి డ్వాక్రా మహిళలకు మహిళా చట్టాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. తరువాత మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో: మైదుకూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఆదివారం ప్రారంభమ య్యా యి. ఈ నెల 8న అంర్జాతీయ మహిళా దినోత్స వం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందు లో భాగంగా ఆదివారం స్థానిక కస్తూర్బా బాలి కల పాఠశాలలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు వారి సిబ్బంది పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న వాహనం వ్యక్తికి తీవ్రగాయాలు



ముద్దనూరు మార్చి2(ఆంధ్రజ్యోతి): కడప- తాడిపత్రి హైవే రోడ్డులోని గంగాదేవిపల్లె సమీపంలో ఆదివారం టాటాఏసీ వాహనం బైకును ఢీకొనడంతో బొడెద్దుల లోకేశ్వరరెడ్డి(37)అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి బంధువుల సమాచారం మేరకు... మంగపట్నంగ్రామానికి చెందిన లోకేశ్వరరెడ్డి పని నిమిత్తం బైకులో కొండాపురం వెళ్లి తిరిగి వస్తుండగా గంగాదేవిపల్లె సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే ముద్దనూరు వైపు నుంచి వస్తున్న టాటా ఏసీ వాహనం ఎదురుగా వచ్చి బైకును ఢీకొంది.దీంతో లోకేశ్వర రెడ్డికి రెండు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నరసింహ



నియామకపత్రం అందుకుంటున్న నరసింహ

బద్వేలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షునిగా బద్వేలుకు చెందిన పగడాల నరసింహ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఈ నియామక పత్రం అందజేశారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ పట్టణ అధ్యక్షునిగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ పూర్వవైభవానికి తనవంతు కృషిచేస్తానన్నారు. తన నియామకా నికి సహకరించిన షర్మిలారెడ్డి, విజయజ్యోతి, కాంగ్రెస్ పార్టీ మాజీ బద్వేలు పట్టణ అధ్యక్షుడు అచ్యుతరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు మట్కా బీటర్ల అరెస్టు

ప్రొద్దుటూరు , మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం దస్తగిరి పేటలో మట్కా నిర్వహిస్తున్న షేక్ నూరుద్దీన్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులను ఆదివారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.70,250 నగదుతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మైదుకూరు రోడ్డు జాతీయ రహదారి కరెంట్ ఆఫీస్‌కు ఎదురుగా ఆదివారం టాటాఏసీ, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో రమేష్ అనే వ్యక్తికి కాలువిరిగింది. స్థానికులు క్షతగాత్రుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు.

ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎంపికైన ఆయనను అల్‌ఆఫ్‌యా దివ్యాంగులు, వయోవృద్ధుల సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆల్‌ఆఫ్‌యా దివ్యాంగుల వయోవృద్ధుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు, రమణ, ఖాదర్‌వలి,నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రబాబు ఉన్నారు.

ఆఫ్తాల్మిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘురామిరెడ్డి



రాష్ట్ర ఆఫ్తాల్మిక్ అధికారుల నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆఫ్తాల్మిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో ఆఫ్తాల్మిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఏపీఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ 30 నుంచి 39 సంవత్సరాల వరకు ఒకే కేడర్‌లో పనిచేసిన ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అంధత్వ నివారణకు లక్ష జనాభాకు ఒక ఆఫ్తాల్మిక్ ఆఫీసర్‌ను నియమించాలని కోరారు. జీవోనెం.143 ప్రకారం ఆఫ్తాల్మిక్ అధికారుల క్యాడర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన ఎన్నిక పట్ల ప్రొద్దుటూరు ఎన్జీవో అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



రామకృష్ణ పరమహంస జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ పరమహంస జయంతిని కామనూరులోని రామకృష్ణ పరమహంస గుడిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పరమహంస విగ్రహానికి పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మినరసయ్య మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస బోధనలకు ఆకర్షితులై ఎంతో మంది ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించారని తెలిపారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, శివనాగిరెడ్డి, క్రిష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో 1983-84 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఆ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వవిద్యార్థులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో చదివిన రోజుల్లో అనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం ఏం చేస్తున్నారో కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 40 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురప్ప, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అడవి పందుల నుంచి పంట రక్షణకు పాట్లు



పంటకు రక్షణగా చీరలు చుట్టిన దృశ్యం

కలసపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అడవిపందుల బారి నుంచి పంట రక్షణకు సైతం చీర ఉపయోగపడుతోంది. మండలంలోని చెన్నారెడ్డిపల్లె, పెండ్లిమర్రి, మహానందిపల్లె, సిద్ధమూర్తిపల్లె, ఎగువరామాపురం, ముదిరెడ్డిపల్లె, లింగారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో సజ్జ, మొక్కజొన్న, వరి, కంది తదితర పంటలు సాగుచేశారు. పంటను అడవిపందుల బారి నుంచి కాపాడుకునేందుకు గతంలో ఎక్కువగా విద్యుత్ కంచెలను ఏర్పాటుచేసుకునే వారు. దాని వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండడంతో చాలా మంది రైతులు పొలం చుట్టూ చీరలు చుడుతున్నారు.

కంది రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం



కందులను జల్లెడపడుతున్న కూలీలు

జమ్మలమడుగు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మార్కెట్‌యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధరపై కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులను ఆదుకుంటోంది. అయితే కందుల నాణ్యత ప్రమాణాలు పాటించి నిబంధనల ప్రకారం ప్రతి రైతుకు క్వింటా రూ.7,550 మద్దతు ధరతో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం కల్పిస్తోంది. జమ్మలమడుగు మార్కెట్ యార్డులో ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

మైలవరం జలాశయంపై సాగుతున్న పనులు



మైలవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంపై రక్షణ గోడలు నూతన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మైలవరం జలాశయానికి రక్షణ గోడల నిర్మాణానికి రూ.33 లక్షలను విడుదల చేసింది. మైలవరం జలాశయంపై గేట్ల పైభాగంలో రక్షణ గోడలు పడిపోయి అధ్వాన్నంగా దర్శనమిస్తుండడంతో కూటమి ప్రభుత్వం నిధులను వెచ్చించి పనులను చేయిస్తోంది. రక్షణ గోడ పనులతో పర్యాటకులకు ఊరటనిస్తోంది. జలాశయం గేట్ల పైభాగంలో ఉన్న రహదారిని పనులు జరుగుతున్న దృష్ట్యా వాహనదారుల రాకపోకలను నిలిపివేశారు.

చెత్తకుండీలు తొలగించండి

మైదుకూరు రూరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి):ప్రజాకవి యోగి వేమన విగ్రహం వద్ద చెత్త కుండీలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక కడప రోడ్డులోని నూతనంగా ఏర్పాటు చేసిన యోగి వేమన విగ్రహం వద్ద చెత్త కుండీలు ఉండటం వలన నిత్యం చెత్తా చెదారాలతో, ఆప్రాంతం అంతా కంపు కొడుతోందని స్థానికులు వాపోతున్నారు. వేమన విగ్రహం దగ్గర ఇలా చెత్తకుండీలు ఉంచటం చాలా బాధకరమని తెలుపుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉపకార వేతనాలు పెంచాలంటూ వినూత్న నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపకార వేతనాలు పెంచి తమకు న్యాయం చేయాలని పశువైద్య కళాశాల విద్యార్థులు మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన చేశారు. విద్యార్థులు చేపట్టిన దీక్ష ఆదివారం 28వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా విద్యార్థులు మాట్లాడుతూ వైద్య రంగ విద్యార్థులతో పాటు సమానంగా పశువైద్య కళాశాల విద్యార్థులకు కూడా స్టైఫండ్‌ను రూ.26 వేలకు పెంచి ప్రభుత్వం వెంటనే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

షాదీఖానాకు రూ.1.50కోట్ల నిధులు మంజూరు



మాట్లాడుతున్న సర్పంచ్ సుధాకర్, తదితరులు

పోరుమామిళ్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) :పోరుమామిళ్ల పంచాయతీలోని ముస్లింలకు మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి రూ.1.50కోట్లు నిధులు మంజూరైనట్లు సర్పంచ్ యనమల సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పోరుమామిళ్ల ప్రాంత ముస్లింల అభ్యర్థన మేరకు బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వారి సమస్యను తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు మాజీ ఎమ్మె ల్యే విజయమ్మకు, రితేష్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎస్‌ఎం బాషా, టీడీపీ సీనియర్ నాయకులు రామసుబ్బారావు, షరీఫ్, సీటి సంఘం అధ్యక్షులు కోటా వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న యూనియన్ నేతలు

ఎర్రగుంట్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు పని, ఆరోగ్య, ఆహార భద్రత కల్పించాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఎర్రగుంట్లలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. సెస్‌రూపంలో వసూలు చేసిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వాలు దారి మళ్లిస్తున్నాయన్నారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వేతన జీవులను విస్మరించిన ప్రభుత్వం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు, మార్చి2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవులను విస్మరించిందని, ఇది బాధాకరమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆమేరకు ఆ దివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కార్మికులకు చోటు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు నిధులను బడ్జెట్‌లో జమచేయలేదన్నారు. కార్మిక వేతనాల కొరకై బడ్జెట్ ప్రతిపాదనలో తగిన మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలిచ్చేవరకూ కాంగ్రెస్ మద్దతు



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ అన్వర్‌బాష

బద్వేల్ రూరల్ మార్చి2, (ఆంధ్రజ్యోతి): బాకరాపేట సమీపంలో గత 10 నెలలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇంటిపట్టాలు, పక్కాభవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించేవరకూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌బాషా పేర్కొన్నారు. గత పది రోజులుగా సీపీఐ కాలనీ వాసులు చేపడుతున్న రిలే దీక్షలకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు స్వంత ఇంటి కల నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ కాలనీ వాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా గండికోట ప్రాజెక్టు రహదారి



రోడ్డుపై కాంకర రాళ్లు బయటపడిన దృశ్యం

కొండాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కడప- తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి గండికోట ప్రాజెక్టుకు ముద్దనూరు మండలం శెట్టివారిపల్లె నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్న హెడ్ రెగులేటర్ నుంచి గండికోట ప్రాజెక్టు వరకు సుమారు 15 కిలోమీటర్ల తారురోడ్డు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు కంకర తేలడంతో పాటు గుంతలు, గుంతలుగా ఉంది. దీంతో ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టును చూడటానికి నిత్యం అనేకమం ది పర్యాటకులు వస్తుంటారు. రోడ్డు పూర్తిగా పాడైనప్ప టికీ గత ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని వెంటనే రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారి విషయమై జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రోడ్డు మరమ్మతులకు కోసం ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం

పోరుమామిళ్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసా గిస్తామని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యుడు శోభన్‌కుమార్, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాపురం ప్రసాద్‌లు పేర్కొన్నారు. మాదిగ అమ రవీరుల స్మారకదినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి అంబేద్కర్ సర్కిల్ వద్ద మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఎంఈఎఫ్ గౌరవ సలహాదారులు జాకోబ్, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.